# పుస్తక పరిచయం




Published by:
Indira Publications
Netaji Nagar
Rayagada – 765 001
Odessa

**ఒరిస్సాలోని** రాయగడ నివాసి నందరావు పట్నాయక్‌గారు, ప్రవాసాంధ్ర రచయితల్లో తనదైన ప్రత్యేకమైన శైలిని సృష్టించుకున్న రచయిత. ఆయన కథల్లోని అంశాలూ, శైలీ కూడా విలక్షణంగా ఉంటాయి. ఈ 'ఆనందరావు కథలు' సంపుటిలో పాతికపైగా కథలు ఉన్నాయి. ప్రతి కథా విలక్షణమైనదే. కాలక్షేపం కథలున్నాయి, ఆలోచింపచేసే కథలున్నాయి, కడుపుబ్బ నవ్వించే కథలున్నాయి, గిలిగింతలు పెట్టే కథలున్నాయి. కథల పరిమాణంలో కూడా మినీకథలు, మైక్రో కథలు, మామూలు కథలు, సుదీర్ఘమైన కథలు కూడా ఉన్నాయి. ఏ రకం కథ వ్రాయడంలో నైనా రచయిత ప్రావీణ్యం కలవారే అని ప్రతికథా నిరూపిస్తుంది. ఎంపికచేసుకున్న కథాంశం చిన్నదే ఐనా కథను చెప్పే విధానం, దాన్ని పెద్ద కథగా విస్తరించిన పద్ధతీ, ముగింపు వరకూ సస్పెన్స్ కొనసాగించడం - ఇలాంటివి కూడా ఇందులోని కొన్ని కథల ప్రత్యేకత. ఉదాహరణ: జీవన్మృతుడు అనే కథలో రుక్మాంగద అనే రుక్కూకి ఏదో ఆరోగ్యసమస్య వచ్చింది, కానీ అదేమిటో ఎవరూ చెప్పడం లేదు కదా, అతన్ని ఏకాకిని చేసేస్తున్నారు. అదేమిటో, ఎందుకలా జరిగిందో తేల్చడానికి ముందు సాగిన 8 పేజీల సంఘటనలు పాఠకుడిలో ఉత్కంఠను పెంచుతాయి. ముగింపు కూడా చేప్పిచెప్పకుండా సూచనప్రాయంగా చెప్పడం, రచనా టెక్నిక్ మీద రచయితకున్న పట్టుని సూచిస్తుంది. "గోవు మాలచ్చిమి" మనసుల్ని కదిలించే కథ. విదేశాల్లో ఉన్న కొడుకోసం వచ్చిన తల్లిదండ్రులకు ఎదురైన అనుభవాలు, హృద్యమైన ముగింపు. ఈ కోవకు చెందిక కథల్లో మరే రచయిత స్పృశించని కోణాలను చూపించిన కథ ఇది. కొన్ని హాస్యకథల్లోని పాత్రల పేర్లు చదవగానే నవ్వు తెప్పిస్తాయి - పందెంకోళ్ళ చిన్నారి , తొందరపాటు తొండమాన్, (యండమూరి,మల్లాది కలిసి) యమశ్రీ , కుమారి కుంభసంభవి, అడ్డగాడిద ఏలేశ్వరం ఇలా. కొన్నికొన్ని వర్ణనలు కూడా రచయిత ప్రతిభకు, నవ్యత్వం కోసం తపించే ఆయన శైలికీ అద్దం పడతాయి. మల్లెపూలు తిని మంచిగంధం తాగే దేవత గొంతు అది, కురులు వేలాడుతూ, దగాపడిన ద్రౌపదిలా ఉంది, హిమాలయాల్లో పన్నెండు సంవత్సరాలకు పుష్పించే బ్రహ్మ పుష్పంలాగ పడుకొంది పాప, విశాఖ బీచ్ కొత్త పెళ్ళికూరులాగ ఉంది.. ఇలా. గొల్లపూడి మారుతిరావుగారు ముందుమాటలో చెప్పారు "ఏమయినా ఆనందరావ్ పట్నాయక్ తను సృష్టించిన బుడంకాయల కాలియాలాగ ప్రవాసంలో మాయమై పోకుండా తన గొంతును తనదైన బాణీలో తెలుగు దేశానికి వినిపించేట్టు చేయడం అభినందనీయం". అందమైన బాల్యాన్ని గుర్తు తెచ్చే ముఖచిత్రంతో రూపుదిద్దుకున్న ఈ కథాసంపుటిని పూర్తిచేశాక ఓ కొత్తలోకానికి వెళ్ళివచ్చినట్లు అనిపిస్తుంది. రచయిత ఆనందరావుగారి కలం నుంచి విలక్షణమైన కథలు విరివిగా రావాలని ఆశిద్దాం. ★★★




**తెలుగు పదాలతో** తమషా ఆటలాడించే వినూత్న ప్రక్రియ యిది. అంకెలు ప్రధానంగా సాగే సుడొకో ఆటను పోలి ఉండే ఈ ప్రక్రియ సృష్టికర్త సాగర్ అనిసింగరాజుగారు. వృత్తిరీత్యా హైటెక్ రంగంలో ఉన్నత పదవిలో ఉన్నా, తెలుగు భాషాభిమానంతో ఆయన రూపొందించిన ఈ ప్రక్రియా, దీన్ని వ్యాప్తిలోకి తీసుకొచ్చిన విధానం, అక్కడనుంచీ దీన్ని పుస్తక రూపంలో వెలువరించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాభిమానులకు చేరువచేసిన పద్ధతీ బహు ప్రశంసనీయం. ఈ ఆట మెదడుకు పదును పెడుతుంది, కాలక్షేపంతో పాటు తెలుగు పదాల పరిజ్ఞానాన్ని పెంచుకునే అవకాశాన్ని కలిపిస్తుంది. ఈ ఆటలో నిబంధనలేమిటంటే - పక్కన ముఖచిత్రంలో చూపినట్లు ఒక పదహారు గళ్ళ చతురస్రంలో, ఒక్కోగడిలో ఒక తెలుగు అక్షరం ఉంటుంది. ఈ అక్షరాలు కేవలం హల్లులు మాత్రమే, అచ్చులు ఎప్పుడైనా, ఎలాగైనా, విడిగా కానీ, ఇందులోని హల్లులతో గానీ కలిపి ఉపయోగించుకోవచ్చు. పక్కపక్కనే ఉన్న (అడ్డం, నిలువు, ఏటవాలు.. ఎలాగైనా సరే) ఉన్న అచ్చులను ( అవసరమైన హల్లులతో కలుపుకుని) ఉపయోగించి అర్థవంతమైన పదాలను, మరింత ముందుకు వెళ్ళి వాక్యాలను వ్రాయాలి. ఒక బృందంగా ఆడేప్పుడు వీటికి పాయింట్లు కూడా పెట్టుకుని బహుమతులూ ఇచ్చుకోవచ్చు. ఉదాహరణకు : పక్కనున్న చతురస్రంలోని హల్లులను గమనిస్తే - కూర్చదగ్గ పదాలు - కణం, తక్కెడ, బుగత, ఈడ, ఆడ, అడ్డం.. వగైరా. వీటితో వాక్యాలను కూడా కూర్చే స్థాయికి వెళ్తే ఆట మరింత పదునుగా ఉంటుంది. తెలుగులో ఇలాంటి ఆట, అదీ పుస్తక రూపంలో రావడం ఇదే ప్రథమం. ఇందులో 50 కార్డులు, ఒక్కో కార్డు(చతురస్రాని)కీ రెండు ఖాళీ, రూళ్ళ పేజీలూ ఉన్నాయి. ఇందులోనే ఊహించిన పదాలను వ్రాసుకోవచ్చు. ఈ పుస్తకం తేలికగా కొనుక్కోడానికి అమెజాన్‌లో లభ్యమౌతుంది. ప్రపంచవ్యాప్తంగా ఎవరైనా, ఎప్పుడైనా కొనుక్కోవచ్చు. తెలుగు భాషాభిమానులకూ, విద్యార్థులకూ, విదేశాల్లో తెలుగు నేర్చుకునే వారికీ.. వెరసి తెలుగును వ్యాప్తిలో ఉంచాలనుకునే భాషాభిమానులందరకూ ఇదొక సువర్ణావకాశం. ఇంతచక్కని ప్రయత్నానికి పునాది వేసి, ఒక ఫలవంతమైన రూపాన్నిచ్చిన సాగర్‌గారు అభినందనీయులు.

★★★

Author: Sagar Anisingaraju
Email: kkrkgame@gmail.com
Web: www.kokkorokogame.com

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**